# మనిషి ÷ ఒకటి




**నా**కింకా పెళ్ళికాలేదు.

ఒకవేళ అయి ఉంటే సాయంత్రం అయిదు గంటలు కావస్తున్నప్పుడు పరాంకుశం నన్ను వెతుక్కుంటూ వచ్చేవాడేనా? తెలీదు. ఈ అనుమానమే నా మనసును తొలచి వేస్తున్నది. అంతగా నన్ను చూడదల్చుకుంటే ఉదయమే రావచ్చు గదా! వీలు కాదా?

ఎందుక్కాదు?

నా గదిలో అతను నా ఎదురుగా పడక్కుర్చీలో ముందుకు వంగి కూర్చున్నాడు. అంతకుముందు వరకు వెనక్కువాలి పడుకున్నాడు. ఇబ్బందిగా ఉందనుకుంటాను– మళ్లీ

ముందుకు వంగాడు. షర్టు నలిగిపోతుందనే భయమనుకుంటాను.

అంత విసుగులోనూ నవ్వొచ్చింది అతని జాగ్రత్తకు. నేనేం చేసేది? నే నుంటున్న ఆ గదిలో ఆ పడక్కుర్చీ- ఓ చాపా తప్పించి మరేమీ లేవు. వచ్చింది ఆడమనిషయితే చాప పరిచి నేనూ పక్కన కూర్చుని కబుర్లు చెప్పేదాన్ని.

కాని- వచ్చిన మనిషి పురుషుడు- పరాంకుశం. గోడ కానుకుని నిల్చున్న నన్ను చూస్తూ "మౌనం రాజ్యం చేస్తోంది కదూ?" అన్నాడతను నవ్వుతూ.

నిజమే. కొన్ని క్షణాలు మామధ్య మాటలు లేవు.

"ఇంకా కథలు రాస్తున్నావా?" అన్నాను.

"లేదు. ఎప్పుడో ఆపేశాను. ఇప్పుడు మళ్లీ రాయాలనిపిస్తోంది నిన్ను చూస్తుంటే"

"ఎందుకూ?"

"కొన్ని ప్రశ్నలకు జవాబులు ఉండవు. అలా అనిపిస్తుంది. అంతే... అది నాలాంటి రచయితకే తెలుసు."

పరాంకుశం కళ్లలోకి సూటిగా చూడాలనిపించింది. కాని చూడలేకపోయాను. అదే ఆడదానిలో బలహీనత అనుకుంటాను. అతని మాటల్లో నేనర్థం చేసుకుంటున్న భావాలను అతని కళ్లలో వెతకాలని నా ఉద్దేశం.

అప్పటికి అతను వచ్చి గంట దాటింది. వెళ్లే ప్రయత్నం చెయ్యడేం? ఇంతకీ అతని మనసులో ఏమున్నది?

మళ్లీ అదే అనుమానం. నాకే పెళ్లయి భర్తతో ఈ పల్లెటూళ్లో ఉంటున్నట్టు అతనికి తెలిసి వుంటే పరాంకుశం ఈ క్షణంలో నా గదిలో ఉండేవాడేనా?

"ఇంతకీ ఎవరి కోసం ఈ నిరీక్షణ?" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగాడు పరాంకుశం మళ్లీ నవ్వుతూనే.

"నిరీక్షణా?" ఆశ్చర్యంగా అడిగాను.

అవును. నిరీక్షణే! వరుడి కోసం - కాదంటావా, విమలా?"

కోపమొచ్చింది అతడి మాటలకు. బహుశా నా మొహంలో ఆ విషయం అతను గ్రహించి ఉండాలి.

ఏమిటీ మనిషి?

ఒంటరిగా ఉంటున్న పెళ్లికాని ఓ ఆడదాని గదిలో కూర్చుని ఈ మాట్లాడటం!

అసలే పల్లెటూరు. లంకంత ఇంట్లో నేనుంటున్నది ఓ గదిలో. అప్పటికే ఆ ఇంటి మనుషులు నాలుగైదు సార్లు ఏదో పని ఉన్నట్లు ఆ వైపుకు వచ్చి మా ఇద్దర్నీ చూసి

వెళ్లారు.

"మాట్లాడవేం, విమలా? నువ్వు నాకంటే ఓ ఏడాది చిన్నదాని వనుకుంటాను. అప్పుడే నాకు ఇద్దరు పిల్లలు. మరి నువ్వో?"

ఈసారి మాట్లాడాను- "నా పెళ్లి గురించి నీకేమిటి ఇంట్రస్టు? నువ్వు చేసుకోవాలనుకున్నా నీకు పెళ్లయింది కదా!"

"అయిందిలే. నాది విశాల హృదయం. అవునూ... ఈ పల్లెటూళ్లో నువ్వెలా ఉంటున్నావో నా కర్థం కావటం లేదు."

కాని అతని మనసులో ఏమున్నదో నాకు అర్థమవుతూనే ఉన్నది. నా పెళ్లి గురించి అతను ఎందుకు మాట్లాడుతున్నాడో నా మనసుకు తెలుసు.

నేనిలా ఆలోచిస్తున్నప్పుడే దూరంగా ఏదో మోటారు వాహనం వస్తున్న మోత వినిపించింది.

"మైగాడ్! మరచిపోయాను. పట్నం వెళ్లటానికి బస్సు వచ్చే టైమయింది" అన్నాను ఆత్రంగా.

"అలాగా!" అంటూ నవ్వాడు పరాంకుశం.

"అవును, పరాంకుశం! పైగా బస్సు కోసం అడ్డ రోడ్డు వరకూ ఊరి బయటకు నడవాలి కదా!"

మళ్లీ అదే నవ్వు.

"నవ్వుతావేం? ఎందుకా నవ్వు?"

"నీ అమాయకత్వానికి, విమలా! నువ్వు చెప్పే ఆ అడ్డరోడ్డు దగ్గరే బస్సు దిగి నేను నిన్ను వెతుక్కుంటూ నువ్వు పంతులమ్మగా ఉద్యోగం చేస్తున్న ఆ స్కూలుకు వచ్చాను. అర్థమయిందా?"

మాట్లాడలేకపోయాను.

పరాంకుశం మనసులో ఏమున్నదో ఇప్పుడు పూర్తిగా అర్థమవుతోంది.

సాయంత్రం అయిదు గంటలు కావస్తున్నప్పుడు శీతాకాలపు నీరెండలో స్కూలు ఆవరణలోకి నడిచి వస్తున్న పరాంకుశాన్ని చూసినప్పుడు ఒకింత ఆశ్చర్యమూ, ఆపైన కొంచెం సంతోషమూ కలిగిన మాట నిజమే.

ఎందుకంటే అతనూ, మేమూ ఒకే వీధిలో ఉండేవాళ్లం. ఒకే కాలేజీలో చదువుకున్నాం. అతను నాకంటే ఓ ఏడాది చదువులో ముందు. అయినా మా కుటుంబాల మధ్య ఉన్న పరిచయం వల్ల అప్పట్లో అతన్తో బాగా మాట్లాడేదాన్ని.

అందుకే ఆ నిముషంలో అతని రాక తర్వాత నాకింత ఇబ్బందిని కలిగిస్తుందని ఊహించలేకపోయాను.

అతనితో స్కూలు కుర్రాడినిచ్చి నా గది చూపమని పంపించాను.

స్కూలు పూర్తయి నేను ఆ గదిలోకి అడుగు పెట్టిన దగ్గర్నుంచే పరాంకుశం మాటలు-ప్రవర్తనా అతడి మీద నా అభిప్రాయాన్ని నిముష నిమిషానికీ మార్చివేస్తూ వచ్చాయి.

ఈ రాత్రికి అతను వెళ్లిపోడా?

ఈ గదిలోనే ఉంటా నంటాడా?

"ఏమిటి ఆలోచిస్తున్నావు, విమలా? నేను వెళ్లిపోయే బస్సు గురించా? దాని గురించి ఇబ్బంది లేదు. ఈ దేశంలో బస్సులు సరైన టైముకు నడవ్వు. అయినా నీ ఆతిథ్యం స్వీకరించకుండా వెళ్లగలనా, ఇంత కష్టపడి ఈ ఊరొచ్చి"

పెద్దగా నవ్వాడు.

ఆ మాటలతో నాకు ఏడుపు వచ్చినట్లనిపించింది. అయినా నా గురించి ఏమనుకుంటున్నాడు? చాలా తక్కువగా అంచనా వేసుకుని ఉండాలి. లేకపోతే ఇలా మాట్లాడడు. చదువుకున్న వాడు, ఉద్యోగం వెలగబెడుతున్నవాడు, సంస్కారవంతుడిలా కనపడుతున్నాడు... మరి ఈ మాట లేమిటి?

కష్టపడి ఈ ఊరు వచ్చాడట. ఎవరు రమ్మన్నారు? ఏదో పనిమీద తను ఉంటున్న ఊర్నుంచి టౌన్‌కువచ్చాడట. అక్కడ మా ఇద్దరికీ తెలిసిన ఒకతను పరాంకుశానికి కనిపించి మాటల్లో నేను ఈ పల్లెటూళ్లో ఓ నాలుగు నెల్లనించి పంతులమ్మగా ఇక్కడి స్కూల్లో పనిచేస్తున్నట్లు చెప్పాడుట. ఇంకేముంది? కష్టపడి పెళ్లికాని ఓ ఆడపిల్ల ఒంటరిగా ఉంటోందని రెక్కలు కట్టుకుని వాలాడు. నేనంటే ఎంత అభిమానం?

అభిమానమంటే గుర్తొచ్చింది. ఇదివరలో నేనెప్పుడైనా అతన్ని ప్రత్యేకించి అభిమానించానా? ఏమో! అప్పట్లో అభిమానించి ఉండవచ్చు. తెలివైన వాడు. బాగానే ఉంటాడు, అప్పుడప్పుడు కథలు రాస్తుంటాడు. ఒక వీధిలోనే ఉంటున్నాడు. ఈ కారణాల వల్ల అతన్ని అప్పట్లో ప్రత్యేకంగా అభిమానించి ఉండవచ్చు.

చదువై పోయింది. ఉద్యోగరీత్యా వెళ్లిపోయాడు. పెళ్లయింది. బహుశ అప్పటికే అతని మీద ఉన్న ఆ ప్రత్యేక అభిమానం కూడా నా మనసునుండి తుడుచుకుపోయి ఉండవచ్చు.

అలాంటిది ఇప్పుడు పరాంకుశం నామీద అభిమానంతో నన్ను వెతుక్కుంటూ వచ్చాడా? పోనీ, అలాగే అనుకున్నా కొంచెంసేపు మాట్లాడి వెలుతురు ఉండగానే వెళ్లిపోవచ్చును గదా! వెళ్లడేం?

వెళ్లడా? అతని మనసులో ఉన్న ఆలోచన అదేనా?

ఇన్నేళ్లయినా పెళ్లి కాలేదు కాబట్టి తనని చూసి మనసు పారేసుకుంటుందని- అన్నీ మరిచపోతుందనీ అనుకుని ఉంటాడు. అవును. ఏ మగాడైనా ఇలాగే ఆలోచిస్తాడు.

ఇంతకీ అతన్ని ఇక్కడి నుంచి బయటకు పంపడం ఎలా?

"నీకో నిజం చెప్పనా, విమలా?" ఉన్నట్టుండి అన్నాడతను.

"ఏమిటా నిజం? నీకీ మధ్య ప్రమోషన్ వచ్చిందా?" అదోలా అన్నాను. నా గొంతు నాకే వింతగా అనిపించింది.

"కాదు. జీవితంలో మనం నష్టపోయేది ఆ పోతున్నప్పుడు తెలీదు. కొన్నేళ్ల తరువాత తెలుస్తుంది. అప్పుడు తెలిసినా ఉపయోగం ఉండదు"

ఉలిక్కిపడి చూశాను.

సందేహం లేదు. పరాంకుశం మనసులో ఏమున్నదో స్పష్టంగా తెలిసింది. అతడి మాటలు కొరడా దెబ్బల్లా తగిలాయి.

"ఇప్పుడు నువ్వేం నష్టపోయావ్ పరాంకుశం?" కావాలనే అన్నాను.

"నేను, నువ్వూ అని కాదు. మనషులందరూ... ఎప్పుడు జరగాల్సినవి అప్పుడు జరిగిపోవాలి. కొంతమందికి కాలం విలువ తెలీదు..."

"ముఖ్యంగా ఇప్పుడు నీకు తెలీడం లేదు"

"నాకా?" నవ్వుతూ అడిగాడు ఆశ్చర్యంగా.

"అవును టౌన్‌కు వెళ్లే బస్సు వెళ్లిపోయి ఉంటుంది. కనీసం చివరి బస్సుకైనా అందుకుంటావా?"

"అది కూడా పోతే మాత్రం ఏం? ఈ ఊళ్లో నాకు తెలిసిన వాళ్లు లేకపోతే గదా!"

"ఈ ఊళ్లో నీకు తెలిసిన వాళ్లు ఎవరున్నారు?" ఆశ్చర్యంతో అడిగాను.

"నువ్వే!"

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు అతడి మాటలకు.

బాగా చీకటి పడింది. ఈమధ్యలో నేను స్విచ్ నొక్కి దీపం వెలిగించాను. రోజూ అయితే ఆ టైములో వంట ప్రయత్నంలో ఉండేదాన్ని. ఇప్పుడు ఈ పరాంకుశాన్ని వదిలించుకునే ప్రయత్నంలో ఉన్నాను.

"మీ పిల్లలు బాగా చదువుతున్నారా?" ఎందుకో అలా అడిగాను.

తల ఊపాడతను ఏదో ఆలోచిస్తూ.

డిసెంబర్ నెల చివరి రోజులు కావడం వల్ల బాగా చలిగా వుంది. తెరచి ఉన్న తలుపుల

మధ్య నుంచి చల్లని గాలి లోపలకు వస్తున్నది.

"చలిగా ఉంది కదూ!" అన్నాడు పరాంకుశం.

నేను మాట్లాడలేదు.

"నిన్నొక మాట అడగనా?"

"ఏమిటి?" అతన్ని చూశాను.

"పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకున్నావా?" అడిగాడతను.

నేనింకేమీ ఆలోచించలేదు.

"ఒక్క నిముషం!" అంటూ అక్కణ్ణుంచి అలమారు దగ్గరకు వెళ్ళాను.

అతనూ మాట్లాడలేదు. నన్నే చూస్తున్నాడు.

అలమార్లో నుంచి డైరీ, పెన్నూ తీసి అతనికిస్తూ "ఇందులో నీ ఎడ్రసు రాయి" అన్నాను.

"ఎందుకూ? నాకు ఉత్తరాలు రాస్తావా?" అడిగాడు.

"కాదు- నా పెళ్లి శుభలేఖ పంపడానికి!" అన్నాను.

"ఎప్పటి నీ పెళ్ళి?" నవ్వుతూ అడిగాడు పెన్ను చేత్తో పట్టుకుని.

"త్వరలోనే! ఇప్పటిదాకా నీతో చెప్పలేదు. సెటిలయింది." నవ్వు తెచ్చి పెట్టుకుని అన్నాను.

"ఏం చేస్తూ ఉంటాడు పెళ్ళికొడుకు?"

"చెప్పను సస్పెన్స్! శుభలేఖలో నీకే తెలుస్తుంది"

"అసలు నీకు తెలిస్తే గదా! అయినా అడ్రసు రాస్తాను" అంటూ డైరీలో తన ఎడ్రసు రాశాడు.

నేను అబద్ధం చెబుతున్నానని అతను గ్రహించాడు. అందుకే అలా అన్నాడు.

అలమార్లో ఉన్న అలారం గడియారాన్ని చూస్తూ "అప్పుడే ఎనిమిది కావస్తోంది" అన్నాను ఆశ్చర్యపడుతున్నట్లు.

"అవును విమలా! నా వాచీలో కూడా సరిగ్గా ఎనిమిదే కావస్తోంది. చివరి బస్ టైం కదూ?" అన్నాడు నవ్వుతూ వాచీ చూసుకుని.

"అడ్డరోడ్డు వరకు నడవాలి కదా! ఈసారి మీ ఆవిడ, పిల్లల్ని తీసుకురా ఒకసారి!" అన్నాను ఇక బయల్దేర మన్నట్లు.

"అప్పుడైనా రాత్రికి ఉండనిస్తావా ఓ పూట ఆతిథ్యంతో!"

"రచయిత వనిపించావు" అన్నాను నవ్వి.

అతను నవ్వలేదు.

బాగా ఆశాభంగం చెందిన వాడిలా ఆ పడక్కుర్చీలో నించి గోతిలో నించి లేస్తున్న వాడిలా లేచి నిల్చున్నాడు.

"మొత్తానికి పెద్ద శిక్షే వేశావు ఇంత దూరం వచ్చినందుకు"

"ఏమిటా శిక్ష?"

"నీ పడక్కుర్చీ... నడుము పట్టేసింది" అంటూ చెప్పులు తొడుక్కుని బయటకు వెళ్లి "వెడతాను. చీకటిగా ఉంది" అన్నాడు.

"మీ ఆవిణ్ణి అడిగానని చెప్పు" అన్నాను ఎంతో అభిమానాన్ని మాటల్లో రంగరించి.

తల ఊపుకుంటూ నడిచి ఆ చీకట్లోనే రోడ్డెక్కాడు పరాంకుశం.

కనీసం రోడ్డు మీద వరకు మర్యాదపూర్వకంగా అతన్తో వెళ్లనందుకు బాధనిపించలేదు.

బాగా రిలీఫ్ ఫీలయ్యాను. తేలిగ్గా ఉంది. గొప్ప ప్రమాదం నుంచిబయట పడినట్లనిపించింది. నేను ఏమాత్రం అవకాశం ఇచ్చినా పరాంకుశం ఈరాత్రికి ఇక్కడే ఉండిపోయేవాడు.

చలిగా ఉందని తలుపులు మూసి చాపమీద వాలిపోయాను.

మళ్లీ అదే ప్రశ్న!

నాకే పెళ్లయి ఉంటే పరాంకుశం నన్ను వెతుక్కుంటూ ఇంత దూరం వచ్చేవాడేనా? రాడనిపించింది.

+++

తలుపు మీద చప్పుడుతో మెలకువ వచ్చింది.

లేచి తలుపులు తెరిచాను. అప్పుడే తెల్లవారుతోంది. ఎదురుగా మా స్కూలు ప్యూను నిలుచుని ఉన్నాడు. అతని చేతిలో పాల చెంబు ఉన్నది. అతను నా పాలమనిషి కూడా.

పాలు అందుకుంటున్నప్పుడు అతను అన్నాడు- "నిన్న సాయంత్రం మీ కోసం వచ్చినాయన ఇప్పుడే కనిపించాడమ్మా!"

ఆశ్చర్యపోయాను.

"ఎవరు? నిన్నస్కూలు వదలబోయేముందు వచ్చినాయనేనా?" అడిగాను ఆగిపోయి.

"ఆc... ఆయనే. దూరం నుంచి చూశాను. మన గుడి మండపం దిగి బయటకు రావడం, బట్టలన్నీ నలిగిపోయి కళ్లు ఎర్రగా ఉన్నాయి. దగ్గరకు వచ్చిన తర్వాత చూస్తే, నేను ఎదురైన తర్వాత 'ఫస్టు బస్సు అందుతుందా?' అంటూ అడ్డరోడ్డు వైపు గబగబా నడుస్తూ వెళ్లాడు"

నా మనసు సిగ్గుతో చచ్చిపోయింది.

ప్యూను వెళ్లిపోయాడు.

నిలబెట్టి ఎవరో నా వీపు మీద ఇనుప కమ్చీతో కొడుతున్నట్లనిపించింది.

జరిగిందేమిటో సులభంగానే గ్రహించాను.

రాత్రి పరాంకుశం ఎక్కవలసిన లాస్ట్ బస్సును రద్దుచేసి ఉంటారు. వారంలో రెండు మూడు రోజులు ఏవో కారణాల వల్ల కాన్సిల్ చేస్తూనే ఉంటారు. రాత్రి కూడా అలాగే జరిగి ఉంటుంది.

బస్సు లేదని తెలుసుకున్నా ఒంటరిగా ఉంటున్న తన గదికి రావడం ఇష్టంలేక ఆకలితో, చలితో ఆ గుడి మండపంలో రాత్రంతా జాగరణ చేసి వెళ్లిపోయాడు పరాంకుశం.

లాస్ట్ బస్సు లేదని అతను తన గదికి ఎందుకు రాలేదు?

రాకూడదు కాబట్టి. పరాంకుశం ఏమిటో ఇప్పుడు నాకు బాగా అర్థమయింది. అతడి మనసు కడిగిన ముత్యం. ఇప్పుడు అతడి ముందు నేనో అల్పజీవిలా అనిపిస్తున్నాను.

కొంతమంది మనుషుల్ని భాగించి విడదీసి చూడలేము. పరాంకుశాన్ని కూడా అంతే.

'కేరెక్టర్' అనేది ఆడదానికే కాదు- మగవాడిక్కూడా ఉంటుందనీ, ముల్లులాంటి మగవాడు కూడా అరిటాకులాంటి ఆడదాని మంచి గురించి ఆలోచిస్తాడనీ మొదటిసారిగా తెలిసింది.

(7-13 జులై 1993 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)